క్లుప్తంగా


శ్రీవారి హుండీలో చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి హుండీలో సొమ్మును అపహరించిన కేసులో కర్నూలు జిల్లా, కోసిగి మండలం, జంపాపురానికి చెందిన జీ.రామకృష్ణ అలియాస్ ఆనంద్‌కు రెండు నెలల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు గురువారం తీర్పు చెప్పారు. గత నెల 15వ తేదీ తిరుమల శ్రీవారి ఆలయంలోని కొత్త హుండీలో నిందితుడు రామకృష్ణ రూ.5,600 అపహరించాడు. సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. టీటీడీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తిరుమల ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు రామకృష్ణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,594 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,213 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.69 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అభినందనల వెల్లువ



టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన భూమన కరుణాకర రెడ్డికి అభినందనలు తెలుపుతున్న మంత్రి ఆర్కే.రోజా, భూమనను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి -తిరుమల

కమ్మకండ్రిగ సర్పంచ్ ఎన్నిక లాంఛనం

రామచంద్రాపురం: ఉప ఎన్నికల్లో కమ్మకండ్రిగ సర్పంచి అభ్యర్థి కావ్య ఎన్నిక లాంఛనమైంది. వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం సర్పంచ్ అభ్యర్థి కావ్యతో కలిసి నామినేషన్‌ను ఎన్నికల అధికారికి అందజేశారు. కమ్మకండ్రిగ సర్పంచ్ కాకర్ల లక్ష్మమ్మ గత ఏడాది మృతి చెందారు. ఈ క్రమంలో ఉప ఎన్నిక చేపట్టారు. గురువారం కాకర్ల కావ్య, ఆమెకు మద్దతుగా దేశినేని చంద్రమౌళి నామినేషన్ దాఖలు చేశారు. సర్పంచ్‌గా కాకర్ల కావ్యను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్తులు ఆమోదం తెలిపారు. ఎవరూ నామినేషన్ వేయలేదు. దీంతో కావ్య ఎన్నిక లాంఛనమైంది. ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి సర్పంచ్‌గా కావ్యకు మద్దతు తెలపడంపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అభినందించారు. 11న నామినేషన్ల పరిశీలన, 12, 13వ తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ, అదేరోజు అభ్యర్థుల ఎంపికను ప్రకటించనున్నట్లు ఎంపీడీవో మహ్మద్‌రఫీ చెప్పారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కావ్య, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డితో కలిసి నామినేషన్ వేస్తున్న సుప్రియ



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న నాయకులు

తిరుచానూరు 8వ వార్డు ఏకగ్రీవం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పంచాయతీ 8వ వార్డు సభ్యురాలిగా సుప్రియ నామినేషన్ ఒక్కటే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి స్రవంతి తెలిపారు. తిరుచానూరు ఉప సర్పంచ్ యాగన్నగారి జమున మృతి చెందడంతో గురువారం జమున కుమార్తె, సుప్రియ నామినేషన్‌ను సెక్రటరీ గిరిధర్‌రెడ్డికి అందజేశారు. ఎవరూ నామినేషన్లు వేయకపోవడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారిణి ప్రకటించారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి, పరాశరేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: పంటపల్లి పంచాయతీ 6వ వార్డుకు కాంతారావురెడ్డి ఒకరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి సుబ్రమణ్యం పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, పంచాయతీ కన్వీనర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

అరణియార్ టూరిజం పనులు వేగవంతం చేయండి

పిచ్చాటూరు: అరణియార్ టూరిజం పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తుడా వీసీ హరికృష్ణ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గురువారం మధ్యాహ్నం అరణియార్ వద్ద తుడా నిధులు రూ.1.82 కోట్లతో చేపడుతున్న మొదటి విడత టూరిజం పనులను ఎమ్మెల్యే, తుడా వీసీ, ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్ పరిశీలించారు. మొదటి విడతలో 1.89 ఎకరాల్లో చేపడుతున్న వ్యూటవర్, బోటింగ్ జట్టీ, 4 బోట్లు, చిల్డ్రన్స్ పార్క్, మరుగుదొడ్లు, రేటైనింగ్ వాల్ పనులు పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. రెండవ దశలో చేపట్టనున్న పనులకు ప్రతిపాదనలు ఇస్తే నిధులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తుడా వీసీ హరికృష్ణ తెలిపారు. రెండో దశలో 0.81 ఎకరాల్లో రూ.3 కోట్లకు ఎంట్రన్స్ ప్లాజా, ఫుడ్ కోర్ట్, కాటేజీలు నిర్మాణం, వెహికల్ పార్కింగ్ ఏరియా, గార్డెన్, లాండ్ స్కేపింగ్, ఫౌంటైన్ పనులు చేపట్టడానికి ప్రతిపాదించామని ఈఈ మదనగోపాల్ తెలిపారు.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,800
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,300
రిటైల్ వెండి గ్రాము	రూ.74.30

ముగిసిన ఇంపాక్ట్ సదస్సు

తిరుపతి కల్చరల్: ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో విద్యార్థులు, యువతకు భవిషత్ లక్ష్య సాధనపై రెండు రోజులుగా చేపట్టిన వ్యక్తిత్వ వికాసం సదస్సు గురువారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి డాలర్స్ గ్రూప్స్ అధినేత డాలర్ దివాకర్‌రెడ్డి, వీవీ.లక్ష్మీనారాయణ, బాలాజీ నర్సింగ్ కళాశాల అధినేత డాక్టర్ వై.ప్రవీణ్, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి హాజరై మాట్లాడారు. నేడు యువత ఎంత బాగా చదువుతున్నా ఆందోళనలు, భయం, నిరుత్సాహం కారణంగా ఉపాధి పొందలేకపోతున్నారని వివరించారు. నమ్మకం, పట్టుదల ప్రయత్నం ఉంటే లక్ష్యాలు సాధించవచ్చన్నారు. ఇంపాక్ట్ సంస్థ సభ్యుడు రచించిన వ్యక్తిత్వ వికాస నైపుణ్యాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ డైరెక్టర్లు డాక్టర్ శ్రీధర్ విట్టలం, నడ్డినారాయణ, మునిలక్ష్మి, ఉయ్ సపోర్టు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు తహసున్నీసా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో



తిరుపతి కల్చరల్: పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో క్రెడాయి ప్రాపర్టీ ఎక్స్‌పో-23 నిర్వహిస్తున్నట్లు క్రెడాయి తిరుపతి చాప్టర్ చైర్మన్ వి.శ్రీనివాసులు, అధ్యక్షుడు రాంప్రసాద్ తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎక్స్‌పోలో బిల్డింగ్స్, ఇంటీరియల్ వంటి వాటితో పాటు నిర్మాణ రంగానికి సంబంధించిన అన్ని రకాల సామగ్రి స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకునే వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. క్రెడాయి తిరుపతి చాప్టర్ కార్యదర్శి రాజేస్‌బాబు, కోశాధికారి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

13న వాలీబాల్ టోర్నమెంట్

చంద్రగిరి(తిరుపతి రూరల్): దక్షిణ భారతదేశంలో ఈశా ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 15వ గ్రామోత్సవంలో భాగంగా చంద్రగిరి మండలం, నరశింగాపురం గ్రామంలో 13న వాలీబాల్, 26న త్రోబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి ఉమేష్‌శర్మ తెలిపారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీసేందుకు టోర్నమెంట్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14 ఏళ్లు నిండిన బాలబాలికలు మాత్రమే అర్హులన్నారు. 8300030999లో సంప్రదించి జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం



తిరుపతి లీగల్: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డిని గురువారం రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్‌రావు సన్మానించారు. తిరుపతి న్యాయవాదులు రాజశేఖర్, దేవరాజులు పాల్గొన్నారు.

రెండో ఘాట్ రోడ్డులో ప్రమాదం

తిరుమల : తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో గురువారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. రెండో ఘాట్ రోడ్డు మీదుగా తిరుమలకు వెళుతున్న బస్సు రెండో మలుపువద్ద కారును తప్పించబోయి రక్షణగోడను ఢీకొంది. దీంతో ప్రయాణిస్తున్న పది మంది భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి నైపుణ్యాలపై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాధ్వాని ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నితన్ బాలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మాస్యూటికల్ కోర్సులో ప్రాథమిక కమ్యూనికేషన్, వర్క్‌ప్లేస్ కమ్యూనికేషన్, ప్రవర్తన నైపుణ్యాలు, డిజిటల్ అక్షరాస్యత, వ్యవస్థాపక మనస్తత్వం, సృజనాత్మక ఆలోచన తదితర నైపుణ్యాలు ఉంటాయన్నారు. దాదాపు 150 మంది విద్యార్థులు ఈ కోర్సు కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు.

సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఎంఏ ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆ విద్యా సంస్థ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో ఎస్.అభిజిత్‌కుమార్‌రెడ్డి 356, ఎం.వెంకటయాదవ్ 352, జె.శిరి 342, డి.హేమాద్రి 340, ఎస్ఎం.గాయత్రి 308, ఎస్.జోషితారెడ్డి 302, ఆర్.యశ్వంత్ 300 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరైన తమ విద్యార్థుల్లో 86.37 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

తనపల్లిలో నేలతల్లికి వందనం

తిరుపతి రూరల్: నా దేశం–నా భూమి కార్యక్రమంలో భాగంగా గురువారం తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో నేలతల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. దేశ రక్షణకు ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ నేలతల్లికి వందనం చేస్తూ ఆ గ్రామంలోని మట్టిని తీసుకుని, దీపారాధన చేసి, జాతీయ జెండాకు వందనం సమర్పించారు. ఎంపీడీఓ వెంకటనారాయణ, సర్పంచులు సునీతారెడ్డి, శుభ, ఏపీవో మమతారాణి పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం, రాయలచెరువు, కుప్పంబాదూరు, కొత్తవేపకుప్పం, పీవీపురం, సీరామాపురం గ్రామాల్లో గురువారం నా భూమి, నా దేశం, నేలతల్లికి నమస్కారం, అమరవీరులకు వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆల్‌బెండజోల్ మాత్రల పంపిణీ

తిరుపతి రూరల్: నులిపురుగుల నివారణకు మాత్రలు వేయడం ద్వారా విద్యార్థుల్లో చురుకుదనం పెరుగుతుందని కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో గురువారం ఆల్‌బెండజోల్ మందులు పంపిణీ చేశారు.

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో 3,991 మంది పిల్లలు ఉండగా 3,933 మందికి గురువారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి శశికళ తెలిపారు. వైద్యులు తేజస్విని, సీహెచ్‌వో శేషకుమారి, ఎంపీహెచ్ఈవో అమర్‌నాథరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు పాల్గొన్నారు.

ముగిసిన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

పాకాల : మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం యాగపూజ, పూర్ణాహుతి, కలశాభిషేకం, తోటోత్సవంతోపాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు కంకణ విసర్జన, ధ్వజావవరోహణం చేపట్టారు. అనంతరం స్వామి వారి పాన్పుసేవ చేశారు. కార్యక్రమాలకు వెలకటూరి రామచంద్రనాయుడు, రామినేని కృష్ణమనాయుడు(లేట్) వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో సేవా టికెట్ల ద్వారా రూ.3,75,750, తలనీలాల ద్వారా రూ.3,40,000, హుండీల ద్వారా రూ.13,70,478, కొబ్బరిచిప్పల వేలం ద్వారా రూ.4,000, సుబ్రమణ్యస్వామి కల్యాణోత్సవం చదివింపుల ద్వారా రూ.7,330 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పట్టాభిరెడ్డి పేర్కొన్నారు. ఈవో మునిశేఖర్, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జయకుమార్, ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ గౌరీశంకర్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు రేవతి, బాబురెడ్డి, లోకనాథం, మాధవి, మమత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ గ్రాంట్ సహకారంతో తిరుపతి నిర్వహిస్తున్న రాస్ ఏఎన్ఎం, ఎంపీహెచ్ డబ్ల్యూ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సుల్లో ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 31 నాటికి 17–30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థినులకు 5 ఏళ్ల సడలింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ చేరిన వారికి ఉచిత విద్య, వసతి లభించడంతో పాటు నెలకు రూ.500 ఉపకారవేతం ఇస్తామన్నారు. చిత్తూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించిన అభ్యర్థినులు మాత్రం ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. టెన్త్, ఇంటర్ మార్కుల జాబితా, టీసీ, కుల, స్థానికీకరణతో పాటు నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, అధార్ కార్డు, 8 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు సెప్టంబర్ 30వ తేదీలోపు ది ప్రిన్సిపల్, రాస్ ఎంపీహెచ్ డబ్ల్యూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, కేరాఫ్ రాస్ సేవా నిలయం, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి-517501 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు.

లెర్నింగ్ టూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి



వర్క్‌షాప్‌నకు హాజరైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ: టీచింగ్ లెర్నింగ్ టూల్స్ ప్రాముఖ్యతపై ట్రైనీ టీచర్స్ అవగాహన పెంచుకోవాలని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్ అధ్యాపకురాలు డాక్టర్ కే అనురాధ సూచించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో గురువారం హ్యూమానిటీస్ బ్లాక్ సెమినార్ హాల్‌లో టీచింగ్ లెర్నింగ్ టూల్స్ అండ్ పప్పెట్రీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు స్వీయ అనుభవంతో నేర్చుకున్న విషయాలు పాఠశాలల్లోని విద్యార్థులకు వారి అవసరాలకు అనుగుణంగా బోధన సామగ్రిని తయారు చేసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావిభాగం అధిపతి ప్రొఫెసర్ టీజీ అముదవల్లి, ప్రొఫెసర్ జి సునీత బాయి, పి.రేణుక, డాక్టర్ వి మాధవి, డాక్టర్ టి శిరీష, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

- రైతు శిక్షణా శిబిరంలో సైంటిస్టుల సూచన
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన రైతులు



రైతులతో అగ్రికల్చరల్ సైంటిస్టులు, జువారీ సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: పంటల అధిక దిగుబడికి భూసార పరీక్షలు తప్పనిసరి అని జువారీ జైకిసాన్ ఫామ్ అబ్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ కేకే సింగ్ రైతులకు సూచించారు. గురువారం స్థానిక ఎన్‌జీరంగా వ్యవసాయ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం, జువారీ జైకిసాన్ ఫామ్ అబ్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతులకు రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంపిక చేసిన 50 మంది రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందే ఉపాయాలను రైతులకు వివరిచామని తెలిపారు. అధునాతన సాగు పద్ధతుల పైన, డ్రోన్ స్ప్రే, అధునిక వ్యవసాయ పనిముట్ల వాడం వంటి అంశాలను ప్రధానంగా రైతులకు తెలియజేసినట్టు వెల్లడించారు. అనంతరం రెండు రోజులు శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో వ్యవసాయ పరిశోధాన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సీ.రమణ, జువారి అగ్రి డెవలప్‌మెంట్ ల్యాబ్ డీజీఎం డాక్టర్ బీ.సుధాకర్, సైంటిస్టులు డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెలకువలు నేర్చుకున్నాం



ఈ శిక్షణలో తక్కువ పెట్టుబడితో ఎలా అధిక దిగుబడిని సాధించాలనే విషయాన్ని తెలుసుకున్నాం. డ్రోన్ స్ప్రే సిస్టమ్ అవశ్యకత, నూతన వ్యవసాయ పనిముట్ల వాడకంపై శిక్షణ ఇచ్చారు. ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. – శంకరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నిజామాబాద్, తెలంగాణ

మందుల పిచికారీపై అవగాహన



శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉంది. పంట సాగుకు ముందు భూమిని ఎలా సారవంతంగా ఉంచుకోవాలి, మందుల పిచకారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అధునాతన వ్యవసాయ పనిముట్లపై శిక్షణ ఇచ్చారు. – ఎంవీ.సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మైదుకూరు, వైఎస్సార్ కడప జిల్లా

భూసారాన్ని బట్టే పంట సాగు





భూసార పరీక్షలపై పూర్తి అవగాహన లేకుండా ఉండేది. ప్రస్తుతం రైతు శిక్షణలో అధికారులు, సైంటిస్టులు మట్టి పరీక్షల అవశ్యకతను తెలయజేశారు. దీంతో సారాన్ని బట్టి ఏ పంట ఏ సీజన్‌లో వేయాలనే అంశాలు అర్థమయ్యాయి. – చంద్రశేఖర్‌గౌడ్, మధు కిషోర్, పశ్చిమగోదావరి











ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రఘురాములు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని రాజన్న పార్కు వద్ద నున్న ఎస్‌వీఎస్ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. షుగర్, బీపీ, థైరాయిడ్, కొలెస్ట్రాల్, ఆస్తమా, కిడ్నీ, లివర్ సమస్యలు, రక్త హీనత, జ్వరం, గుండె వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ రఘురాములు, డాక్టర్ క్రిష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకరంబాడికి ఘన నివాళి


శంకరంబాడి సుందరాచారికి నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: మా తెలుగుతల్లికి మల్లెపూదండ రాష్ట్ర గీతాన్ని తెలుగు వారికి అందించిన శంకరంబాడి సుందరాచారికి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాళులర్పించారు. శంకరంబాడి సాహితీ పీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం లక్ష్మీపురం సర్కిల్‌లోని శంకరంబాడి విగ్రహం వద్ద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ శంకరంబాడి సుందరాచారితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. 2004లో తిరుపతిలో ఏర్పాటుచేసిన శంకరంబాడి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హైదరాబాద్ నుంచి తిరుపతికి వచ్చారని తెలిపారు. మేయర్ శిరీష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత మాట్లాడుతూ శంకరంబాడి సుందరాచారి తిరుపతి వ్యక్తి కావడం మనందరికీ గర్వకారణమన్నారు. శంకరంబాడి సాహిత్య పీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు డి.మస్తానమ్మ మాట్లాడుతూ మా తెలుగుతల్లికి మల్లెపూదండ గేయంతో తెలుగు ఖ్యాతిని చాటిన మహనీయుడు శంకరంబాడి అని పేర్కొన్నారు. డాక్టర్ గంగి సుహాసిని మా తెలుగు తల్లికి గేయాన్ని ఆలపించి ఆకట్టుకున్నారు. సాహితీవేత్తలు సాకం నాగరాజు, శైలకుమార్, మౌని, గంగవరపు శ్రీదేవి, తమటం రామచంద్రారెడ్డి, వాకా ప్రసాద్, టెంకాయల దామోదరం, పరమేశ్వరయ్య, శ్రీమన్నారాయణ, స్రవంతి, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే. బాబు, కార్పొరేటర్ కోటూరి ఆంజనేయులు, బి.లక్ష్మయ్య, అక్కినపల్లి లక్ష్మయ్య, నల్లానిబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరిలోని ధర్మరాజులు సమేత ద్రౌపది దేవి ఆలయంలో గురువారం ధ్వజారోహణంతో మహాభారత ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. చంద్రగిరి ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, చంద్రగిరికి చెందిన రాజులగారి ఎర్రమరెడ్డి కుమారులు ఉభయ దాతలుగా వ్యవహరించి హరికథా గానాన్ని ప్రారంభించారు. రాత్రి శానంబట్ల మాజీ సర్పంచ్ ముడిపల్లి రాణి సురేష్ రెడ్డి, సర్పంచ్ యశోద శంకర్ యాదవ్ ఉభయ దాతలుగా వెంకటేశ్వర నాట్యకళా మండలి ఆధ్వర్యంలో వేద వ్యాస జననం వీధి నాటకం ప్రదర్శించారు.

బస్సు పాసుల పంపిణీ

పాకాల: జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి తన సొంత నిధులతో మండలంలోని విద్యార్థులకు బస్సు పాసులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో మండలంలోని సుమారు 300ల మంది విద్యార్థులకు తన సొంత నిధులు వెచ్చించి బస్సు పాసులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు 3 ఏళ్ల కాల పరిమితి గల బస్సు పాసులు ఇచ్చినట్టు వెల్లడించారు. ఎంఈవో-1 బాబ్జీ, ఎంఈవో-2 లింగయ్య, నాయకులు నంగా నితిన్‌రెడ్డి, సుధాకర్, మురళి, బాలకృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

12న శుద్ధ తిరుమల - సుందర తిరుమల

తిరుపతి సిటీ: తిరుమల, తిరుపతి రెండు ఘాట్ రోడ్లు, నడకదారుల్లో శనివారం శుద్ధ తిరుమల - సుందర తిరుమల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి ఆదేశించారు. ఆమె గురువారం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో టీటీడీ విద్యాసంస్థల నుంచి 750 మంది విద్యార్థులు పాల్గొంటారని, ఒక్కో సెక్టార్లో 30 మంది చొప్పున 25 సెక్టార్లుగా విభజించామని చెప్పారు. రవాణా, శానిటరీ మెటీరియల్, క్యాటరింగ్, ప్రథమ చికిత్స కిట్లు, చెత్త సేకరణ, రోప్‌లు, వైర్ లెస్ సెట్లు తదితర అంశాలపై ఆమె ఆరా తీశారు.



